## క్లుప్తంగా

### సమస్యల పరిష్కారానికి హామీ



విల్లూరి భాస్కరరావుకు వినతిపత్రం ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

**జగదాంబ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందరికి న్యాయం జరుగుతుందని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. 35వ వార్డు పరిధిలో విధినిర్వాహణలో మృతి చెందిన వారికి, 60 ఏళ్లు దాటిన వారి కుటుంబంలో వ్యక్తులకే ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ కార్మికులు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విషయంపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

**దాబాగార్డెన్స్:** బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు క్షీరాభిషేక సేవ**

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

### పలువురి రక్తదానం



రక్తం దానం చేస్తున్న చిరంజీవి యువత వ్యవస్థాపకుడు స్వామినాయుడు

**మహారాణిపేట:** అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపకుడు రవణం స్వామినాయుడు పుట్టిన రోజు సందర్భంగా మహారాణిపేటలో ఉన్న రెడ్ క్రాస్ భవనంలో రక్తదాన శిబిరం గురువారం నిర్వహించారు. 25 మంది రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ కార్యదర్శి రవి కుమార్, పీఆర్‌వో రావు, కొయిలాడ శ్రీనివాస రావు , గాజువాక మెగా ఫ్యామిలీ యువత అధ్యక్షుడు పొలరౌతు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బొంతు కనకరాజు, సిటీ నుంచి వాసుపల్లి ఎల్లాజీరావు, ఎంవీపీ ఎల్లాజీరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### 18న మాతృమూర్తి సేవా పురస్కారాల ప్రదానం

**మద్దిలపాలెం:** మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మాతృమూర్తి సేవా పురస్కారాలు ప్రదానోత్సవం నిర్వహించనున్నామని ట్రస్ట్ ప్రతినిధి మేడా మస్తాన్‌రెడ్డి తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, ఏసీపీ వివేకానంద, ఏపీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు దాడి సత్యనారాయణ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారన్నారు.





విస్తరణ జరుగుతున్న వన్‌టౌన్ ప్రధాన రహదారి

# ఏళ్ల నాటి కల.. నెరవేరనుందిలా

- వన్‌టౌన్ రహదారి విస్తరణలో అందరికీ మేలు జరిగేలా ప్రభుత్వ నిర్ణయం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, వ్యాపారులు

**ప్రజల కోసమే ప్రభుత్వాలు.. అని రాజకీయ, సామాజిక నిపుణులు ఏనాడో చెప్పిన మాటలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తుచ తప్పకుండా అమలు చేస్తూ ప్రజాసంక్షేమానికి చిత్తశుద్ధితో పాలన సాగిస్తోంది. వన్‌టౌన్‌లోని పాతనగర రహదారి విస్తరణ సమస్య ఎన్నో ఏళ్ల నుంచి పట్టి పీడిస్తోంది. ఇక్కడి రహదారిని వెడల్పు చేయడం ద్వారా ప్రజలకు సౌలభ్యం.. వ్యాపారాభివృద్ధి జరుగుతుంది కనుక రోడ్డు విస్తరణ చేస్తామని గతంలో పలు ప్రభుత్వాలు చెప్పాయి. అయితే అటువంటి ప్రయత్నం ఏదీ ఇప్పటి వరకు జరగలేదు. అవన్నీ నీటి మీద రాతల్లాగానే మిగిలాయి. అయితే ప్రజలకు ఏం కావాలో.. వారికేది చేస్తే మంచి జరుగుతుందో అదే చేస్తూ ముందుకెళుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాతనగర రహదారి విషయంలోనూ ప్రజలకు మేలు జరిగేలా పనులు ప్రారంభించేందుకు నడుం బిగించింది. అందులో భాగంగా రహదారి విస్తరణలో మధ్యేమార్గంగా ఎవరికీ ఎటువంటి నష్టం వాటిల్లకుండా విస్తరణ చేయాలని భావించడంతో ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారు.**

**జగదాంబ:** ఎట్టకేలకు పాతనగర వాసుల కల నెరవేరనుంది.. నగరంలో ప్రధాన కేంద్రం అయిన పాతనగరం రహదారికి మోక్షం కలిగింది. గత ప్రభుత్వాలన్నీ రహదారి వెడల్పు చేస్తామని చెప్పడమే తప్ప ఏనాడూ అటువంటి ప్రయత్నం కూడా చేయలేదు. ఎన్నికల సమయంలో మాత్రం రహదారి గురించి హడావుడి ప్రకటనలు చేసి.. తర్వాత ఆ విషయం గురించి మాట్లాడేవి కాదు.

అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఏం చెప్పిందో అదే చేస్తోంది. ఎవరికీ ఎటువంటి నష్టం వాటిల్లకుండా అందరికీ సమన్యాయం చేస్తూ రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో 100 అడుగుల రహదారిని 60 అడుగులకు విస్తరిస్తూ.. రోడ్డు వెడల్పు ప్రక్రియలో ఎవరూ నష్టపోకుండా లెక్కలు సరి చేసింది. దీంతో సున్నితమైన పాతనగరం రహదారి విస్తరణ సమస్యకు చక్కటి పరిష్కారం దొరికి అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**జగదాంబ నుంచి..**

వాస్తవంగా జగదాంబ జంక్షన్ నుంచి రహదారి వెడల్పు చేయాల్సి ఉన్నా చౌట్రీ వద్ద నుంచే పనులు ప్రారంభిస్తున్నారు. అక్కడి నుంచి అయితే పెద్దగా ఆ ప్రాంతంలోని భవనాలను కొట్టే పని లేదు. తమకు అనుకూలంగానే ప్రభుత్వం కూడా పనులు చేస్తుండడంతో రోడ్డు వెడల్పులో నష్టపోతున్న చాలా మంది ప్రజలు టీడీఆర్‌లు పొందుతున్నారు. ఏళ్లనాటి సమస్య వైఎస్సార్‌సీపీ తీసుకున్న ఒక్క నిర్ణయంతో సద్దుమణిగిందని ప్రజలు అంటున్నారు.



రహదారి విస్తరణకు కొలతలు వేస్తున్న అధికారులు

### మంచి ఆలోచన ..



ప్రజలకు ఇబ్బంది లేకుండా.. వారికి మంచి చేసే ప్రభుత్వాలతో అందరికీ మేలు జరుగుతుంది. ఇప్పుడు రహదారి విస్తరణలో వైఎస్సార్‌సీపీ తీసుకున్న నిర్ణయం బాగుంది. పాతనగరం వరకు రహదారి 60 అడుగులుగానే నిర్ణయించడంతో ఎవరూ పెద్దగా నష్టపోవడం లేదు. రోడ్డు వెడల్పు జరుగుతుంది.. అదే సమయంలో ప్రజలు, వ్యాపారులు ఎటువంటి నష్టానికి గురి కారు.

అరుణ్, వ్యాపారి, పూర్ణామార్కెట్.

### ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి..



నిత్యం రద్దీగా ఉండే పాతనగరం రహదారి వెడల్పుతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి. ముఖ్యంగా పూర్ణామార్కెట్, ఏవీఎస్ కళాశాల డౌన్ రోడ్డులో ఎప్పుడు చూసినా ట్రాఫిక్‌తో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రహదారి వెడల్పుతో ఆ సమస్య పరిష్కారం అవుతుంది. రోడ్డు ప్రమాదాలు కూడా ఉండవు.

సత్యనారాయణ, వ్యాపారి, పూర్ణామార్కెట్.

## కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి



పార్టీ నాయకులు, కార్యకర్తలతో గ్రీవెన్స్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

**దాబాగార్డెన్స్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖలో ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా నియమించాలని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి పలు వార్డుల సీనియర్ నాయకులు వినతి పత్రం అందజేశారు. సినీ హీరో కృష్ణ కాంస్యవిగ్రహం బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేయాలని విశాఖ సిటీవైడ్ హీరో కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యుడు అప్పారావు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడారు. పార్టీ కార్యకర్తల పిల్లలకు ఎమ్మెల్యే కళాశాల రామబాణం జూనియర్ కళాశాల, వైజాగ్ డిఫెన్స్ అకాడమీలో ఉచితంగా ఇంటర్ విద్యకు, కొంతమంది కార్యకర్తల పిల్లలు ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాల, స్కూల్స్‌లో ఉచితంగా చదువుకునేందుకు సిఫార్సు చేశారు. గ్రీవెన్స్‌లో కనకమహాలక్ష్మి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, పలు వార్డుల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు ముజీబ్‌ఖాన్, బి శ్రీనివాసరెడ్డి, ఆరుగుల రాజు, గౌరీశంకర్, అశోక్, సురేష్, ఆదినారాయణ, సలీం, అనీల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మదయ ఉంటే చాలు



అన్నసమారాధనలో పాల్గొన్న సీతంరాజు సుధాకర్ తదితరులు

**అల్లిపురం:** అమ్మదయ ఉంటే అన్నీ ఉంటాయి అని వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ నాయకుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయంలో గురువారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా ఆయన రేణుక యల్లమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ గౌరవ సలహాదారు బొడ్డేటి ప్రసాద్, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, ఉపాధ్యక్షుడు పంపాన గణేష్, కోశాధికారి వాసుపల్లి నారాయణ, జాయింట్ సెక్రటరీ బడే నాగరాజు, సహకోశాధికారి సత్యనారాయణ, 33వ వార్డు కార్పొరేటర్ రంధి గోపీకృష్ణ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేపట్టారు.

## విద్యాకానుకను సద్వినియోగం చేసుకోండి



జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసిన రంధి గోపీకృష్ణ, హెచ్‌ఎం కనకమహాలక్ష్మి

**అల్లిపురం:** రూపాయి ఖర్చు లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన విద్యా కానుకను విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, అల్లిపురం మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కనకమహాలక్ష్మీ అన్నారు. అల్లిపురం మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను జగనన్న విద్యాకానుక పంపిణీ గురువారం జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులకు భారం లేకుండా అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వాటిని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో గౌరీవీధి సచివాలయం కార్యదర్శి పీవీజీ కిరణ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా సాయిరాం



ఉత్తర్వులు స్వీకరిస్తున్న సాయిరాం

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా ఈఎస్ఎస్ ఈఎస్ఎస్ వ్యవస్థాపకుడు, సంస్థ సంచాలకుడు సాయిరాం బొల్లాప్రగడ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ నుంచి ఆయన నియామక ఉత్తర్వులు స్వీకరించారు. విద్యార్థులను పరిశ్రమలకు అనుగుణంగా మలిచేలా సేవలు అందించాలని సాయిరాంకు వీసీ సూచించారు.

## చెట్ల నీడలో..



ఎండ కారణంగా కార్మికులు చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. వివిధ పనుల కోసం వచ్చిన కార్మికులంతా జోన్-4 కార్యాలయం వద్ద చెట్ల నీడలో సేదదీరారు.

–జగదాంబ

## వర్సిటీ అభివృద్ధిపై హర్షం



వీసీ ప్రసాద రెడ్డిని కలిసిన ప్రేంబాబు తదితరులు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం సాధిస్తున్న అభివృద్ధిపై వైఎస్ఆర్‌సీపీ గ్రీవెన్స్ సెల్ విశాఖ అధ్యక్షుడు ప్రేమ్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జాతీయ స్థాయిలో వివిధ సంస్థలు విడుదల చేసిన ర్యాంకుల్లో ఏయూ అత్యుత్తమ స్థానాలను సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ వీసీ ప్రసాదరెడ్డిని ఆయన అభినందించారు. గత నాలుగు సంవత్సరాలుగా విశ్వవిద్యాలయంలో జరిగిన అభివృద్ధి ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఓర్వలేకే పవన్ కల్యాణ్ విమర్శలు

**దాబాగార్డెన్స్:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేక ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విమర్శిస్తున్న వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఖండించారు. పవన్ కల్యాణ్‌కు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే అన్ని జిల్లాల్లో బీసీల హక్కులు, అభ్యున్నతికి పాటుపడాలన్నారు. జనసేన అభ్యర్థులు పోటీ చేసే నియోజకవర్గాల్లో మాత్రమే పవన్ యాత్ర చేస్తున్నాడని, ఇది ముమ్మాటికీ రాజకీయ యాత్రేనన్నారు. జనసేన అధ్యక్షుడిగా ఉన్న పవన్.. ముఖ్యమంత్రి అభ్యర్థిగా చెప్పుకోకపోవడం సిగ్గుచేటన్నారు.

## ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

**బీచ్ రోడ్డు:** రక్తం సమయానికి అందక చాలా మంది మరణిస్తున్నారని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం చాలా అవసరమని 198 బెటాలియన్ సెకండ్ కమాండింగ్ ఆఫీసర్ నావల్ కిశోర్ చౌదరి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బెటాలియన్ ద్వారా పాడేరు, విజయనగరం జిల్లాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. ఇలా సేకరించిన రక్తాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీంద్ర సింగ్ సజ్వాన్, భగత్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలి

- ఆర్ఐవో సత్యనారాయణ



ఆర్ఐవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలేజీ నిర్వాహకులు

**విశాఖ విద్య:** విద్యార్థుల అభ్యున్నతికి కాలేజీల నిర్వాహకుల పాటుపడాలని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ అన్నారు. ఆర్ఐవోగా నియమితులైన సత్యనారాయణను నగరంలోని ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు గురువారం కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఐవో సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ విద్య ప్రాధాన్యత దృష్ట్యా విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. చదువుతో పాటు సామాజిక దృక్పథం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

## నాణ్యమైన విద్యే జగనన్న లక్ష్యం



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ జానకీరామ్



విద్యార్థులతో ఓనమాలు దిద్దిస్తున్న కార్పొరేటర్

**దాబాగార్డెన్స్ :** రాష్ట్రంలో ప్రతి విద్యార్థి తన కుటుంబ సభ్యులుగా భావించి, వారికి నాణ్యమైన విద్య అందివ్వడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ పేర్కొన్నారు. వార్డు పరిధి జీవీఎంసీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో గురువారం జగనన్న విద్యా కానుక కిట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, పలువురు ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. పిల్లలతో ఓనమాలు దిద్దించారు. ఈ సందర్భంగా చెన్నా మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి అనేక రకాలుగా తోడ్పాటునందిస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని, ఉన్నత విద్యనభ్యసించి, ఉన్నతంగా రాణించాలన్నారు.

కార్యక్రమంలో ఆకుల యేసు, రెయ్యి డేవిడ్‌రాజు, కాసారపు వాసు, వెంకటలక్ష్మి, నిమ్మకాయల ఆదిలక్ష్మి, దైవకుమార్, ఆనంద్, రమణ, శేఖర్, రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.

## 24న డ్యాన్సింగ్ సూపర్ స్టార్ గ్రాండ్ ఫైనల్స్





సమావేశంలో మాట్లాడుతున్న రంజన్ నాయక్

**దాబాగార్డెన్స్:** విశాఖలో డ్యాన్సింగ్ సూపర్ స్టార్ సీజన్ 6 గ్రాండ్ ఫైనల్స్ గురజాడ కళాక్షేత్రం వేదికగా నిర్వహించనున్నట్టు పేస్ క్రియేటర్స్ డ్యాన్స్ అకాడమీ ఫౌండర్ రంజన్ నాయక్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 20 ప్రధాన నగరాల్లో ఆడిషన్స్ నిర్వహించామని, 20 టీములను గ్రాండ్ ఫైనల్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన న్యాయ నిర్ణేతగా ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ధర్మేష్ వ్యవహరిస్తున్నారని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొంటున్నట్టు తెలిపారు. ఇండియన్ హిప్ హాప్ ఇంటర్నేషనల్ విన్నర్స్ సాగర్ బోరా, కార్తీక్ రాజా, రవివర్మ, దీపక్ రాజ్‌పుత్ తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈవెంట్ ప్రధాన స్పాన్సర్ సునీత మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని, టాలెంట్‌ను వెలికి తీసే ఈ తరహా ఈవెంట్లకు మా సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గెలుపొందిన విజేతలకు ఫస్ట్ ప్రైజ్‌గా రూ.లక్ష, సెకండ్ ప్రైజ్‌గా రూ.50వేలు, థర్డ్ ప్రైజ్‌గా రూ.25వేలు అందజేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఈవెంట్ హౌస్ మేనేజింగ్ డైరెక్టర్ రవిశంకర్, అగర్వాల్ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జేమ్స్ ఆడమ్స్, రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధి ప్రతీక్‌సింగి, రూపేష్, చాందిని తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ రచనలతో సామాజిక వికాసం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

**దాబాగార్డెన్స్:** మహాకవి శ్రీశ్రీ రచనలతో సామాజిక వికాసం సాధ్యమైందని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు తెలిపారు. శ్రీశ్రీ 40వ వర్ధంతి పురస్కరించుకొని గురువారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) మద్రాస్‌లో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకొని ముందుగా ఏవీఎన్ కళాశాలలో జువాలజీ విభాగం డిమానిస్ట్రేటర్‌గా పనిచేశారన్నారు. అటువంటి గొప్పవ్యక్తి ఇదే కళాశాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం తమ సంస్థకు ఎంతో గౌరవమన్నారు. ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ గోవిందరాజులు మాట్లాడుతూ ఎన్నో కథలు, రచనలు, సంకలనాలు చేసి సమాజ మార్పునకు శ్రీశ్రీ శ్రీకారం చుట్టారన్నారు. గొప్ప వ్యక్తులను స్మరించుకోవడంతో పాటు వారి జీవన విధానాన్ని నేటి సమాజం తెలుసుకొని జీవించాలన్నారు. ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ విశాఖ నగర అధ్యక్షుడు కె.అభిలాష్ మాట్లాడుతూ యువత నైతిక విలువలతో మెలగాలని, సామాజిక బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. శ్రీశ్రీ సమాజానికి అందించిన సాహిత్య సేవను గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా కళాశాల విద్యార్థినికి గోల్డ్‌మెడల్



కృష్ణవేణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపక బృందం

**దాబాగార్డెన్స్:** ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ముంబైలో నిర్వహించిన నేషనల్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థి బి.కృష్ణవేణి స్పీడ్ స్ప్రింట్ 30 సెకండ్స్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. డబుల్ అండర్ 30 సెకండ్స్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. కళాశాలలో గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని కృష్ణవేణిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, కళాశాల ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ కేవీఎల్ శిరీష, బోటనీ విభాగాధిపతి డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కృష్ణవేణిని అభినందించారు.

## సీఎం సహాయనిధి చెక్ అందజేత



సీఎం సహాయ నిధి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

**దాబాగార్డెన్స్:** స్థానిక అంగటిదిబ్బలో నివశిస్తున్న పాశిల అప్పారావు కుమారుడు జనార్దన్ ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనికి సంబంధించి ఆర్థిక సాయం చేయాలని ఎమ్మెల్యే వాసుపల్లికి వినతిపత్రం అందజేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సీఎం సహాయ నిధి కింద రూ.18వేలు మంజూరు చేయించారు. గురువారం బాధితుడి ఇంటికి నేరుగా వెళ్లి పరామర్శించి, చెక్ అందజేశారు. కార్యక్రమంలో పీతల వాసు, బుల్లెట్ రవి, ఆరుగుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి మేరుగు జన్మదిన వేడుకలు

**ఏయూ క్యాంపస్:** రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ఏయూ పూర్వ ఆచార్యులు, మేరుగు నాగార్జున జన్మదిన వేడుకలు ఏయూలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య జాలాది రవి, ఆచార్య చంద్రమౌళి, ఆచార్య పి.ప్రేమానందం, ఎస్.పుల్లారావు పాల్గొన్నారు.